
బుధవారం
24-7-2024
# ముందడుగు
దినపత్రిక
సంపుటి: 1, సంచిక: 403 పేజీలు: 4 | ₹6
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD
EPAPER.MUNDADUGU.COM

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..
Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com




గంజాయి మత్తులో ఇంజనీరింగ్ విద్యార్థులు..?

మిగతా 3లో



నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించొద్దు

మిగతా 2లో



విడాకులయ్యాక భార్య భవిష్యత్తు ఏంటి..?

మిగతా 4లో



ఆ పాత్ర చేయడం కోసం వారిని గమనించా : బడ్డీ హీరోయిన్

మిగతా 5లో



# రికార్డు బ్రేక్ చేసిన నిర్మలమ్మ

- ఏడు బడ్జెట్‌లను సమర్పించిన ఆర్థిక మంత్రి
- వీటి ధరలు తగ్గించారు- వీటి ధరలు పెంచారు
- ఇది 2024-25 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్

ముందడుగు జాతీయం:
పార్లమెంట్ వర్షా కాల సమావేశాల సంధర్భంగా కేంద్ర ప్రభుత్వం 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో మిగిలిన 8 నెలల కాలానికి వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టింది. ఉదయం 11 గంటలకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్ లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్మలమ్మ తాత్కాలిక బడ్జెట్ ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే. ఇక కేంద్రంలో మరోసారి మోదీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇవాళ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబం ధించి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. తాజా బడ్జెట్ ప్రసం గంలో ఆర్థిక మంత్రి కొన్ని వస్తువులపై కస్టమ్స్ డ్యూటీ తగ్గించి, మరి కొన్నింటిపై పెంచుతున్నట్లు తెలిపారు. దీని ఫలితంగా కొన్ని వస్తువుల ధరలు హెచ్చుతగ్గులకు గురికావచ్చు. తాజా బడ్జెట్ నిర్ణయాలతో ఏ వస్తువుల ధరలు పెరుగుతాయి, ఏ వస్తువుల ధరలు తగ్గుతాయో ఒకసారి చూద్దాం

### రికార్డు బ్రేక్ చేసిన నిర్మలమ్మ

ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ సరికొత్త రికార్డ్ నెలకొల్పనున్నారు. వరుసగా రెండోసారి ఆర్థిక మంత్రిగా ఎన్నికైన ఆమె.. 2024-25 బడ్జెట్‌ను సమర్పించి సరికొత్త రికార్డును బ్రేక్ చేశారు. వరుసగా ఏడు కేంద్ర బడ్జెట్‌లను సమర్పించిన ఆర్థిక మంత్రిగా ఆమె సరికొత్త రికార్డ్ క్రియేట్ చేశారు. వరుసగా ఆరుసార్లు బడ్జెట్‌లను సమర్పించిన మాజీ ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయ్‌ని అధిగమించారు. మొరార్జీ దేశాయ్ వరుసగా ఆరుసార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 1959-64 మధ్య ఐదు పూర్తిస్థాయి బడ్జెట్లు, ఒక తాత్కాలిక బడ్జెట్‌ను మొరార్జీ దేశాయ్ ప్రవేశ పెట్టారు.

### ధరలు పెరిగే వస్తువులు

**టెలికాం డివైజ్‌లు**
కొన్ని రకాల టెలికాం పరికరాలపై బేసిక్ కస్టమ్ డ్యూటీని 10% నుంచి 15 శాతానికి పెంచారు. దీని ఫలితంగా వాటి ధరలు పెరుగుతాయి.

**అమ్మోనియం నైట్రేట్**
అమ్మోనియం నైట్రేట్‌పై కస్టమ్స్ డ్యూటీ 10 శాతానికి పెంచారు. దీంతో దీని ధరలు కూడా పెరగనున్నాయి.

**నాన్ బయోడిగ్రేడబుల్ ప్లాస్టిక్స్**
నాన్ బయోడిగ్రేడబుల్ ప్లాస్టిక్స్‌పై కస్టమ్స్ డ్యూటీ 10%కి పెంచుతున్నట్లు బడ్జెట్‌లో ప్రస్తావించారు. దీంతో వీటి ధరలు కూడా పెరగనున్నాయి.

### ధరలు తగ్గే వస్తువులు

**మొబైల్ ఫోన్లు**
మొబైల్ ఫోన్లు, వాటి ఛార్జర్లపై విధించే బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 15 శాతానికి తగ్గించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పేర్కొంది. దీంతో రాబోయే రోజుల్లో స్మార్ట్‌ఫోన్ల ధరలు తగ్గే అవకాశం ఉంది.

**క్యాన్సర్ డ్రగ్స్**
క్యాన్సర్ ప్రాణంతక వ్యాధి. దీనికయ్యే చికిత్స కూడా భారీగా ఉంటుంది. దీని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వ

మిగతా 2లో

# బడ్జెట్‌లో తెలంగాణ పేరే ఎత్తలేదు

- ప్రధాని మోడీ తెలంగాణ పట్ల కక్ష కట్టారు
- కిషన్ రెడ్డినే అందుకు బాధ్యత వహించాలి
- మండిపడ్డ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి




ముందడుగు తెలంగాణ:
కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ పట్ల వివక్ష ప్రదర్శించారని రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై ఆయన స్పందిస్తూ బడ్జెట్‌లో తెలంగాణ అనే పదాన్నే నిషేధించారని మండిపడ్డారు. "మా ప్రభుత్వంలోని మంత్రులు 18 సార్లు ఢిల్లీకి వెళ్లారు. తెలంగాణకు

మిగతా 2లో

# ఏపీ, బిహార్‌లకు బడ్జెట్‌లో పెద్దపీట

- అమరావతికి రూ.15వేల కోట్ల ప్రత్యేక సాయం
- బిహార్‌కు రూ. 26వేల కోట్ల ఆర్థిక సాయం



ముందడుగు జాతీయం:
ప్రధాని మోడీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రెండు రాష్ట్రాలకు ప్రాధాన్యం కల్పించింది. ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు ప్రత్యేక హోదా సాధ్యం కాదని తేల్చిచెప్పిన కేంద్రం.. బడ్జెట్‌లో మాత్రం అధిక కేటాయింపులతో శాంతపరిచే ప్రయత్నం చేసినట్లు కనిపిస్తోంది. ఈ క్రమంలో తాజా బడ్జెట్‌లో రెండు రాష్ట్రాలల్లో

మిగతా 2లో

ముందడుగు
బుధవారం,
24-7-2024,
హైదరాబాద్

# రికార్డు బ్రేక్ చేసిన నిర్మలమ్మ

(మొదటిపేజీ తరువాయి)

మూడు లేదా అంతకంటే ఎక్కువ క్యాన్సర్ ట్రీట్‌మెంట్ డ్రగ్స్‌కు కస్టమ్స్ డ్యూటీ నుంచి పూర్తిగా మినహాయింపు ఇచ్చింది. దీంతో రాబోయే రోజుల్లో క్యాన్సర్ మందుల ధరలు తగ్గనున్నాయి.



**బంగారం, వెండి**

కేంద్ర ప్రభుత్వం మహిళలకు గుడ్‌న్యూస్ చెప్పింది. బంగారం, వెండిపై కస్టమ్స్ డ్యూటీని 6 శాతానికి తగ్గిస్తున్నట్లు బడ్జెట్‌లో వెల్లడించింది. దీంతో భవిష్యత్‌లో బంగారం, వెండి ఆభరణాలు ధరలు తగ్గవచ్చు.

**ప్లాటినం**

ఇటీవల కాలంలో బంగారం, వెండి ఆభరణాలతో పాటు ప్లాటినం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. తాజాగా బడ్జెట్‌లో ప్లాటినంపై కస్టమ్స్ డ్యూటీని 6.5 శాతానికి తగ్గిస్తున్నట్లు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.

**సీఫుడ్**

తాజాగా బడ్జెట్‌లో బ్రూడ్ స్టాక్స్, రొయ్యలు, చేపల మేతపై బేసిక్ కస్టమ్స్ సుంకం 5 శాతానికి తగ్గించారు. ఫలితంగా రాబోయే రోజుల్లో రొయ్యలు, చేపల ధరలు తగ్గవచ్చు. బడ్జెట్‌లో ఈ ప్రకటన తర్వాత, సీఫుడ్ ఉత్పత్తుల సంస్థలు, ఎగుమతిదారుల షేర్లు పెరగడం గమనార్హం.

**సౌర శక్తి భాగాలు**

సౌరశక్తి సంబంధిత విభాగాలపై కస్టమ్స్ డ్యూటీని పొడిగించకూడదని కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించింది. సోలార్ సెల్స్, ప్యానెళ్ల తయారీలో ఉపయోగించే మూలధన వస్తువుల పన్ను మినహాయింపు జాబితా మరింత విస్తరించారు. దీని ఫలితంగా సోలార్ సెల్స్, ప్యానెళ్ల ధరలు తగ్గవచ్చు.

**చెప్పులు**

లెదర్, చెప్పుల తయారీపై కస్టమ్స్ సుంకాన్ని తగ్గిస్తామని కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించింది. దీంతో రాబోయే రోజుల్లో చెప్పుల ధరలు కూడా తగ్గవచ్చు.

**క్రిటికల్ మినరల్స్**

కీలకమైన 25 ఖనిజాలను కస్టమ్స్ సుంకాల నుంచి మినహాయింపు ఇచ్చారు. వాటిలో రెండింటిపై BCDని తగ్గిస్తారు. ఫెర్రోనికెల్, బ్లిస్టర్ కాపర్‌పై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని తొలగించారు.

# బడ్జెట్‌లో తెలంగాణ పేరే ఎత్తలేదు

(మొదటిపేజీ తరువాయి)

అవసరమైన నిధులు ఇవ్వాలని స్వయంగా నేను ప్రధానికి విజ్ఞప్తి చేశా. కానీ, తెలంగాణ పదం పలకడానికి కేంద్రం ఇష్టపడటం లేదు. మొదటి నుంచి ప్రధాని మోడీ తెలంగాణ పట్ల కక్ష కట్టారు. ఇప్పటి వరకు ఆర్ఆర్ఆర్‌కు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఏ రంగానికీ సహకారం అందించలేదు. వికసిత్ భారత్‌లో తెలంగాణ భాగం కాదని ప్రధాని అనుకుంటున్నారు.

## కిషన్‌రెడ్డి బాధ్యత వహించాలి

బడ్జెట్‌లో బిహార్, ఏపీని మాత్రమే పట్టించుకున్నారు. ఇతర రాష్ట్రాలను పట్టించుకోలేదు. 8 సీట్లు ఇచ్చి తెలంగాణ ప్రజలు భాజపా పట్ల వివక్ష చూపలేదు. 8 సీట్లు ఇవ్వడం వల్లే మోదీ ప్రధాని కుర్చీలో ఉన్నారు. తెలంగాణకు ఐఐఎం ఇవ్వలేమని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లేఖ రాశారు. అలాంటప్పడు కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి ఎందుకు కొనసాగుతున్నారు? కేంద్రమంత్రి పదవి కోసం కిషన్‌రెడ్డి.. తెలంగాణ హక్కులను మోదీ వద్ద తాకట్టుపెట్టి ప్రజలను మోసం చేస్తున్నారు. బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి కిషన్‌రెడ్డి బాధ్యత వహించాలి. కేంద్ర వైఖరికి నిరసనగా కేంద్రమంత్రి వర్గం నుంచి రాజీనామా చేసి బయటకు రావాలి.

# ఏపీ, బిహార్‌లకు బడ్జెట్‌లో పెద్దపీట




(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి ప్రాజెక్టులకు కేటాయింపులను పరిశీలిస్తే..

## అమరావతికి రూ.15వేల కోట్లు!

ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని చెబుతోన్న కేంద్ర ప్రభుత్రం ఆ దిశగా అడుగులు వేసినట్లు కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్ పునర్‌వ్యవస్థీకరణ చట్టం అమలుకు కట్టుబడి ఉన్నామని ఉద్ఘాటించింది. రాష్ట్రానికి రాజధాని అవసరాన్ని గుర్తించి.. అమరావతికి రూ.15వేల కోట్ల ప్రత్యేక సాయాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలోనే అందిస్తామని తెలిపింది. అవసరాన్ని బట్టి వివిధ ఏజెన్సీల ద్వారా మరిన్ని నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చింది. పోలవరం ప్రాజెక్టును కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామని పేర్కొంది. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో వెనకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు మంజూరు చేయనున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించింది.

## బిహార్ రోడ్లకు రూ.26వేల కోట్లు

బిహార్‌లో రహదారుల అభివృద్ధి కోసం కేంద్రం భారీగా కేటాయింపులు జరిపింది. ఇందుకోసం మొత్తంగా రూ.26వేల కోట్ల ఆర్థిక సాయం అందిస్తామని తెలిపింది. జాతీయ రహదారుల కోసమే రూ.20వేల కోట్లు కేటాయించనున్నట్లు ప్రకటించింది. పట్నా-పుర్నియాలను కలుపుతూ ఎక్స్‌ప్రెస్‌వే అభివృద్ధి చేస్తామని పేర్కొంది. బక్సర్-భాగల్‌పుర్, బోధ్‌గయా-రాజ్‌గిర్-వైశాలీ-దర్భంగాలను అనుసంధానిస్తామని తెలిపింది.



# నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించొద్దు

## అభిప్రాయం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు

ముందడుగు జాతీయం:

నీట్ ప్రశ్నపత్రం లీకైన మాట వాస్తవమేనని సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. నీట్ అంశంపై విచారణ ముగియడంతో సీజేఐ ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. నీట్ మళ్లీ నిర్వహించాలన్న డిమాండ్‌ను సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఝార్ఖండ్‌లోని హజారీబాగ్, బిహార్‌లోని పట్నాలోని కేంద్రాల్లో నీట్-యూజీ ప్రశ్నపత్రం లీకైందన్న మాట వాస్తవం. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు చేస్తోంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం దాదాపు 155 మంది లబ్ధిపొందినట్లు తెలుస్తోంది. ఈ విద్యార్థులపై చర్యలు తీసుకోవాలి. పరీక్ష పవిత్రత దెబ్బతిన్నదని చెప్పేందుకు సరైన ఆధారాలు లేవు. వ్యవస్థ మొత్తం నిర్వీర్యమైందని నిర్ధరణకు రావడం ప్రస్తుత దశలో కష్టం. మళ్లీ పరీక్ష పెడితే 24 లక్షల మంది ఇబ్బంది పడతారు. వారిలో అనేకమంది వందల కి.మీల దూరం ప్రయాణం చేసి పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు'' అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు.

# నరసాపురం ఎంపీడీవో మృతదేహం లభ్యం

## విజయవాడలోని ఏలూరు కాలువలో గుర్తింపు



ముందడుగు విజయవాడ:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నరసాపురం ఎంపీడీవో వెంకట రమణారావు అదృశ్యం ఘటన విషాదాంతమైంది. ఆయన మృతదేహాన్ని విజయవాడలోని ఏలూరు కాలువ లభ్యమైంది. మధురానగర్ రైలు పైవంతెన వద్ద ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది బయటకు తీశారు. ఎంపీడీవో అదృశ్యమై 8 రోజులు దాటినా ఆచూకీ తెలియలేదు. ఈ నెల 15న ఆయన మధురానగర్ రైలు వంతెన పైనుంచి ఏలూరు కాల్వలో దూకారు. దీనిపై గత వారం రోజులుగా ఎన్డీఆర్ఎఫ్ బలగాలు, పెనమలూరు పోలీసులు గాలింపు చేపట్టారు. ఏలూరు కాలువను పోలీసులు జల్లెడ పట్టారు. మధురానగర్ పైవంతెన పిల్లర్‌కు చిక్కుకున్న మృతదేహాన్ని గుర్తించారు. దూకిన ప్రదేశానికి కిలోమీటర్ దూరంలోనే లభ్యమైంది. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని చూసి ఎంపీడీవో కుమారులు, ఇతర కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

ముందడుగు
బుధవారం,
24-7-2024,
హైదరాబాద్

# పరువు నష్టం దావా వేసిన అంజలి బిర్లా

- తనపై తప్పుడు ఆరోపణలు చేశారని వెల్లడి
- సోషల్ మీడియా పోస్టులు తొలగించాలని పిటిషన్



ముందడుగు జాతీయం:
లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె, ఐఆర్‌పీఎస్ అధికారిణి అంజలి బిర్లా ఢిల్లీ హైకోర్టులో పరువు నష్టం దావా వేశారు. తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ చేసిన సోషల్ మీడియా పోస్టులను తొలగించాలంటూ హైకోర్టులో పిటిషన్ వేశారు. వృత్తిరీత్యా మోడల్ అయిన అంజలి బిర్లా 2019లో యూపీఎస్సీ పరీక్షలు రాశారు. తొలి ప్రయత్నంలోనే ఉత్తీర్ణత సాధించారు. ఆ తర్వాత 2021లో కమిషన్‌లో చేరారు. అయితే, ఇటీవలే నీట్ – యూజీ పేపర్ లీక్ అంశం తీవ్ర వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. దీంతో అంజలి వివాదం తెరపైకి వచ్చింది. తన తండ్రి ప్రభావంతోనే అంజలి తొలి ప్రయత్నంలో యూపీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిందంటూ సోషల్ మీడియాలో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వాదనలను అంజలి కొట్టిపారేశారు. కొందరు సోషల్ మీడియా వేదికగా తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. తనకు, తన తండ్రి పరువుకు నష్టం కలిగించే విధంగా పోస్టులు పెడుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు 16 ఎక్స్ ఖాతాల వివరాలను తన పిటిషన్‌లో పొందుపరిచి కోర్టుకు అందజేశారు. ఆ ఖాతాల్లో తనపై వచ్చిన పోస్టులను తొలగించాలని కోరారు. ఈ మేరకు పరువు నష్టం దావా వేశారు. అంజలి పిటిషన్‌ను విచారణకు హైకోర్టు స్వీకరించింది.




# గంజాయి మత్తులో ఇంజనీరింగ్ విద్యార్థులు..?

- హాస్టల్స్ పక్కన టీ షాపులో విక్రయాలు
- కాలేజీలు, హాస్టల్స్ పై పెరిగిన పోలీస్ నిఘా

ముందడుగు క్రైం:
రాష్ట్రంలో మాదకద్రవ్యలకు సంబంధించిన అనేక విషయాలను ఎక్కడో ఒక దగ్గర మనం నిత్యం చూస్తూనే ఉన్నాము. ఈ మధ్యకాలంలో మత్తు పదార్థాలను కొందరు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థిలకు విక్రయిస్తూ వారి జీవితాలను శూన్యంలోకి నెట్టేస్తున్నారు. కొన్ని ప్రవేట్ హాస్టల్లో ఇంజనీరింగ్ విద్యార్థులు విచ్చలవిడిగా గంజాయి తాగుతున్నట్లుగా తెలుస్తోంది. కానీ హాస్టల్ యజమానులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. నిరంతరం పోలీసుల నిఘా లేకపోవడమే హాస్టల్లో గంజాయి సప్లయి అవుతున్నట్లు స్థానికులు చెపుతున్నారు. గంజాయి బానిసై ఉరి వేసుకున్న ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు కూడా గతంలో చాలానే చోటుచేసుకున్నాయి. హైదరాబాద్ నగరంలో వేలాది ప్రైవేట్ హాస్టల్స్ కొనసాగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. టీ స్టాల్ వద్ద గంజాయి అమ్ముతున్నట్లుగా మాకు తెలిసిందని పోలీసులు అంటున్నారు. ఇప్పటికే ప్రైవేట్ హాస్టల్లో పైన రైడ్ చేశామని, గల్లికొక్కటిగా పుట్టుకొస్తున్న ప్రైవేట్ హాస్టల్లో ఇలాంటి కార్యక్రమాలు సాగుతున్నట్లు పోలీసులు అంటున్నారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ప్రవేట్ హాస్టల్ విద్యార్థుల వద్ద గంజాయిని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. వివిధ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న 6 మంది విద్యార్థులను పట్టుకొని పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. చిన్న చిన్న ప్యాకెట్లు చేసి విక్రయిస్తున్న టీ షాప్ యజమానులకు ఇది ఎక్కడ నుండి వస్తుందని త్వరలో గుర్తిస్తామని పోలీసులు తెలిపారు. ఈ విషయంపై కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఇండియాలో పెరిగిన అటవీ విస్తీర్ణం

- 2.66 లక్షల హెక్టార్ల అటవీ ప్రాంతం పెరుగుదల
- ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ వెల్లడి



ముందడుగు జాతీయం:
భారతదేశ భూభాగంలో అటవీ విస్తీర్ణం పెరిగింది. 2010 నుంచి 2020 వరకు దేశంలో సుమారు 2.66 లక్షల హెక్టార్ల అటవీ ప్రాంతం పెరిగినట్లు ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్(ఎఫ్ఏవో) తన రిపోర్టులో పేర్కొన్నది. అటవీ శాతం పెరిగిన టాప్ 10 దేశాల్లో ఇండియా మూడవ స్థానంలో ఉన్నది. సోమవారం రిలీజైన రిపోర్టులో చైనా మొదటి స్థానంలో ఉన్నది. చైనాలో 1,937,000 హెక్టార్ల మేర అటవీ విస్తీర్ణం పెరిగినట్లు రిపోర్టులో తెలిపారు. ఆ తర్వాత రెండవ స్థానంలో ఆస్ట్రేలియా ఉన్నది. ఆస్ట్రేలియాలో 4,46,000 హెక్టార్ల మేర అటవీ ప్రాంతం పెరిగింది. టాప్ టెన్ దేశాల్లో చిలీ, వియత్నాం, టర్కీ, అమెరికా, ఫ్రాన్స్, ఇటలీ, రొమేనియా ఉన్నాయి. ఇండియాలో అటవీ విస్తీర్ణం పెరిగిన నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి ప్రశంసలు కురిపించింది. నిర్వీర్యం అవుతున్న నేలల్లో ఇన్నోవేటివ్ పద్ధతుల ద్వారా భారత్ తన అటవీ విస్తీర్ణాన్ని పెంచుతున్నట్లు యూఎన్ తెలిపింది. చాలా వరకు దేశాల్లో అటవీ నిర్మూలన తగ్గినట్లు ఆ రిపోర్టులో తెలిపారు. ఇండోనేషియాలో 2021 నుంచి 2022 వరకు డిఫారెస్టేషన్ 8.4 శాతం తగ్గినట్లు పేర్కొన్నారు. బ్రెజిల్ లోని అమెజాన్ అడవుల్లోనూ 2023లో అటవీ నిర్మూలన 50 శాతం తగ్గినట్లు రిపోర్టులో తెలిపారు.

ముందడుగు
బుధవారం, 24-7-2024, హైదరాబాద్

# కేంద్ర బడ్జెట్ 2024ని ప్రశంసించిన పాలసీ బజార్ పార్ట్‌నర్స్



ముందడుగు హైదరాబాద్: పాలసీ బజార్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్ క్రింద ఉన్న బ్రాండ్ పాలసీ బజార్ పార్ట్‌నర్స్, సమాజంలోని వివిధ వర్గాలలో ఆర్థిక వృద్ధి, ఆవిష్కరణ మరియు సామాజిక చేరికలను ప్రోత్సహించేందుకు అనువుగా, దూరదృష్టితో రూపొందించిన భారత ప్రభుత్వ కేంద్ర బడ్జెట్ 2024కి బలమైన మద్దతును తెలియజేస్తుంది. బడ్జెట్ కేటాయింపులు బీమా రంగంపై విస్తృత స్థాయిలో గణనీయమైన సానుకూల ప్రభావాన్ని చూపుతాయని పేర్కొంది. పీబీ పార్ట్‌నర్స్ సహ వ్యవస్థాపకుడు ధ్రువ్ సారిన్ మాట్లాడుతూ, "సమాజంలోని అన్ని వర్గాలు ముందుకు సాగే విధానాన్ని దృష్టిలో భారత ప్రభుత్వం ఉంచుకుని రూపొందించిన కేంద్ర బడ్జెట్ 2024ని మేము అభినందిస్తున్నాము. బీమా పాలసీలను విక్రయించే వ్యక్తిగత ఏజెంట్లకు (మూలం వద్ద మినహాయించిన పన్ను) రేట్లను 5% నుంచి 2% వరకు తగ్గించడం అనేది ప్రత్యేకంగా ప్రశంసించదగ్గ అంశం. ఎందుకంటే ఇది వారి పునర్వినియోగపరచదగిన ఆదాయాన్ని నేరుగా పెంచుతుంది" అని పేర్కొన్నారు.

## బడ్జెట్‌లో అనుబంధ అంశాలపై

# కేంద్రం దృష్టి

### హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆర్థికవేత్త అభిక్ బారువా




ముందడుగు హైదరాబాద్: ఈ బడ్జెట్‌లో ఉపాధి, నైపుణ్యాల నిర్మాణం వంటి అనుబంధ అంశాలపై కేంద్రం దృష్టి సారించింది. భారతదేశం జనాభా డివిడెండ్‌ను పొందేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు కార్మిక శక్తితో కూడిన ఉత్పత్తి, దాని నైపుణ్యం చొరవ, అధికారిక ఉద్యోగ కల్పనను ప్రోత్సహించడం, శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం వంటివి కనిపిస్తున్నాయి. ఈ చర్యలతో ఏడాదికి 8 మిలియన్ల ఉద్యోగాలను సృష్టించేందుకు సహాయపడతాయని బడ్జెట్ అంచనా... ఇది ఆర్థిక సర్వేలో పేర్కొన్న ఉపాధి అవసరాలకు అనుగుణంగా ఉంటుందని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రధాన ఆర్థికవేత్త అభిక్ బారువా తెలిపారు.

ఆదాయపు పన్ను స్లాబ్‌లలో మార్పుతో పాటు మొదటి సారి పనిచేసే కార్మికులకు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ, పునర్వినియోగపరచదగిన ఆదాయాలను పెంచడం ద్వారా వినియోగాన్ని, ప్రత్యేకించి చిన్న టికెట్ వస్తువులను పెంచే అవకాశం ఉంది. బడ్జెట్ పాలసీ మిశ్రమం - నిరంతర కేపెక్స్, ఉద్యోగాల సృష్టి, తయారీ, వ్యవసాయం మరియు గ్రామీణాభివృద్ధికి మద్దతుతో సహా - భారతదేశ సంభావ్య వృద్ధికి సానుకూలంగా ఉండే అవకాశం ఉంది.

# విడాకులయ్యాక భార్య భవిష్యత్తు ఏంటి..?

- చిన్నచిన్న తగాదాలకే పెరుగుతున్న విడాకులు
- విడాకులు తీసుకున్న భార్యకు కొన్ని హక్కులు
- భార్యకు భరణం ఎలా నిర్ణయిస్తారు



ముందడుగు ప్రత్యేకం: భారతదేశంలోనూ చాలా జంటలు చిన్నపాటి గొడవల కారణంగానే విడిపోతున్నారు. కొందరు సెలబ్రిటీలు కూడా పెళ్లి చేసుకున్న కొన్నేళ్లకే విడాకులు తీసుకుంటున్నారు. భారతదేశంలో విడాకులు అంత సులభంగా తీసుకోవచ్చా? విడాకులయ్యాక భార్య భవిష్యత్తు ఏంటి అని చాలామంది క్వశ్చన్ చేస్తున్నారు. సాధారణంగా భారతదేశంలో విడాకులు తీసుకున్నాక మహిళలకు కొన్ని హక్కులుంటాయి. వీటి ద్వారా మాజీ భర్త ఆస్తిని మాజీ భార్య అడగవచ్చు, భరణం పొందవచ్చు. ఈ హక్కుల గురించి అవగాహన కలిగి ఉంటే మంచిది. అవేవో చూద్దాం.

### విడాకుల సమయంలో ఆస్తి హక్కులు

భర్త, భార్య ఇద్దరూ కలిసి డబ్బు చెల్లించడం ద్వారా ప్రాపర్టీని కొనడం సాధారణం. అలాంటి సందర్భాల్లో విడాకుల తర్వాత భార్యకు తన 50% వాటాతో పాటు భర్త వాటాలో కూడా వాటాను క్లెయిమ్ చేసుకునే హక్కు ఉంటుంది. విడాకులు ఖరారు అయ్యే వరకు భార్యకు ఆ ప్రాపర్టీలో నివసించే హక్కు కూడా ఉంది. ఒకవేళ ఆస్తిని భర్త ఒక్కడే కొనుగోలు చేస్తే, భార్యను క్లాస్ I చట్టబద్ధమైన వారసురాలుగా పరిగణిస్తారు కాబట్టి, ఆమెకు భరణం పొందే రైట్ ఉంది.

భర్త పేరు మీద రిజిస్టర్ అయిన ప్రాపర్టీలో ఇంట్రెస్ట్ క్లెయిమ్ చేయడానికి, ఆమె తన ఆర్థిక సహకారాలకు సంబంధించిన డాక్యుమెంటేషన్‌ను చూపించాలి. మహిళ తన సొంత డబ్బుతో చెల్లించిన అన్ని ఆస్తులు ఆమెకు చెందినవే అవుతాయి. ఆమె ఆ ఆస్తులను ఇతరులకు ఇవ్వడానికి, అమ్మడానికి లేదా తన దగ్గరే ఉంచుకోవడానికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది.

### భరణం హక్కులు

భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 125 కింద ఒక మహిళ తనకు, తన పిల్లలకు అధికారికంగా విడిపోయే సమయంలో మెయింటెనెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మెయింటెనెన్స్ లేదా భరణాన్ని తాత్కాలికంగా కోరవచ్చు లేదా పర్మనెంట్‌గా కూడా కోరవచ్చు. తాత్కాలిక భరణం అంటే సపోర్ట్ కోసం దరఖాస్తు చేసుకున్న సమయం నుంచి కోర్టు తీర్పు వచ్చే వరకు భర్త చెల్లించే డబ్బు. శాశ్వత భరణం అంటే హిందూ అడాప్షన్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్ 1956లోని సెక్షన్ 25 ప్రకారం, న్యాయస్థానం ఒకేసారి చెల్లించమని సూచించవచ్చు లేదా నెలవారీ చెల్లింపు చేయమనవచ్చు.

### భరణం ఎలా నిర్ణయిస్తారు?

భారతదేశంలో భరణం హిందూ వివాహ చట్టం, ప్రత్యేక వివాహ చట్టం వంటి అనేక చట్టాల ద్వారా నిర్ణయిస్తారు. భరణం మొత్తాన్ని నిర్ణయించేటప్పుడు, న్యాయస్థానాలు దంపతుల జీవన ప్రమాణం, వారి వివాహ వ్యవధి, పిల్లల అవసరాలు (ఉంటే) వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుంటాయి. భర్త, భార్య మధ్య జీతం వ్యత్యాసం భారీగా ఉన్న సందర్భంలో, కూడా పనిచేసే మహిళలకు భరణం మంజూరు చేయవచ్చు. విడాకుల సమయంలో ఆస్తులు రక్షించడానికి ముందస్తు ప్రణాళిక చాలా ముఖ్యం. ట్రస్ట్‌లను ఏర్పాటు చేయడం, వివాహానికి ముందున్న ఆస్తుల కచ్చితమైన రికార్డులను సంరక్షించడం, వేర్వేరు బ్యాంక్ అకౌంట్‌లు కలిగి ఉండటం ద్వారా వ్యక్తిగత సంపదను వైవాహిక ఆస్తి నుంచి వేరు చేయవచ్చు.

# బెస్ట్ సపోర్టివ్ పిఆర్ అవార్డు అందుకున్న జయరాం

### ఎపీ మాజీ ఐటి ప్రధాన కార్యదర్శి అవార్డు బహుకరణ



ముందడుగు హైదరాబాద్: తెలుగు రాష్ట్రాలలోని పిఆర్ రంగంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు సాధించుకున్న పబ్లిక్ రిలేషన్స్ ప్రొఫెషనల్ మరియు మీడియా మానియా పిఆర్ కమ్యూనికేషన్స్ వ్యవస్థాపకుడు జి. జయరాం ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకున్నారు. హైదరాబాద్ నగరంలో ఐకాన్ సంస్థ నిర్వహించిన ఐ లవ్ హెచ్‌ఆర్ అవార్డ్స్ కాన్క్లేవ్ అండ్ ఎక్స్‌పోలో ప్రతిష్ఠాత్మకమైన "బెస్ట్ సపోర్టివ్ పిఆర్" అవార్డును ఆంధ్రప్రదేశ్ మాజీ ఐటి ప్రధాన కార్యదర్శి జెఏ చౌదరి అవార్డును అందజేశారు. హైటెక్ సిటీలోని ఇన్నా కన్వెన్షన్ లో జరిగిన ఈ కార్యక్రమం లో హెచ్‌ఆర్ నిపుణులు, పరిశ్రమల నాయకులు మరియు విద్యావేత్తలను ఒకచోట చేర్చి మానవ వనరుల రంగంలో అర్హులైన విజేతలకు అవార్డులను అందజేశారు. ప్రతిష్ఠాత్మకమైన వేదిక నుంచి ఈ అవార్డును అందుకోవడం గర్వంగానూ, గౌరవంగానూ భావిస్తున్నాను అని జయరాం అన్నారు.


ముందడుగు
బుధవారం,
24-7-2024,
హైదరాబాద్



# ఆ పాత్ర చేయడం కోసం వారిని గమనించా: బడ్డీ హీరోయిన్

అల్లు శిరీష్ హీరోగా నటించిన తాజా చిత్రం బడ్డీ. శామ్ ఆంటోన్ దర్శకత్వంలో రూపొందిస్తున్న ఈ చిత్రంతో ప్రిషా సింగ్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీ ద్వారానే టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. ఇప్పటికే ట్రైలర్ రిలీజ్ కాగా.. అభిమానుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ప్రస్తుతం మూవీ ప్రమోషన్లతో బిజీగా ఉంది చిత్రబృందం. ఈ సందర్భంగా హీరోయిన్ ప్రిషా సింగ్ బడ్డీ సినిమాలో అవకాశం రావడంపై ఆసక్తికర కామెంట్స్ చేసింది. ప్రిషా సింగ్ మాట్లాడుతూ .. 'నా ఫొటోలను చూసి ఆడిషన్‌కు పిలిచారు. సెలక్ట్ అయ్యా. అయితే పాత్రలోని వేరియేషన్స్ నేను చేయగలనా అని కూడా ఆలోచించా. బడ్డీ చిత్రంలో నేను ఎయిర్ హోస్టెస్ పాత్రలో కనిపిస్తా. ఆ పాత్ర కోసం చాలా మంది ఎయిర్ హోస్టెస్‌లను గమనించా. వారెలా నడుస్తారు.. ఎలా మాట్లాడుతారు.. ఇతరులతో ఎలా ప్రవర్తిస్తారు? వంటి విషయాలను దగ్గరగా గమనించా. టాలీవుడ్ నటించటం నటిగా నాకొక మంచి అనుభవం. ఇంకా వైవిధ్యమైన పాత్రలు చేయటానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నా' అని అన్నారు. అంతే కాకుండా తనకు వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ అంటే అభిరుచి ఎక్కువని చెబుతోంది. ఇటీవలే ఇన్‌స్టాగ్రామ్‌లో వాటికి సంబంధించిన ఫొటోలను షేర్ చేసింది. వైల్డ్ లైఫ్ అంటే కేవలం జంతువులను, చెట్ల ఫొటోలను కెమెరాల్లో బంధించటం మాత్రమే కాదని అంటోంది. వాటి సహజమైన భావోద్వేగాలను కమెరాల్లో బంధించటమేనని వెల్లడించింది. మన కెమెరాల్లో బంధించే ప్రతి విషయానికి బలమైన కథ ఉంటుందని.. నటన పరంగానూ ఇది నన్ను మెరుగుపరుచుకునేలా చేసిందని తెలిపింది. అందుకే కెమెరా ముందు ధైర్యంగా నటిస్తున్నా అని ప్రిషా సింగ్ చెప్పుకొచ్చింది. కాగా.. బడ్డీ చిత్రం ఆగస్టు 2న థియేటర్లలో సందడి చేయనుంది.

# రెప్పల్ డప్పల్



హీరో రవితేజ, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ కీలకపాత్రధారులు. పనోరమా స్టూడియోస్ అండ్ టి–సిరీస్‌ల సమర్పణలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. ఈ సినిమాలోని 'రెప్పల్ డప్పల్...' అంటూ సాగే రెండోపాట లిరికల్ వీడియోను ఈ నెల 25న విడుదల చేయన్నుట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్.

# అనుభవాల్లోంచి పుట్టుకొచ్చిన కథ



బండి సరోజ్‌కుమార్ స్వీయ దర్శకత్వంలో నటిస్తు నిర్మిస్తున్న చిత్రం 'పరాక్రమం'. శృతి సమన్వి, నాగలక్ష్మి, మోహన్ సేనాపతి, నిఖిల్‌గోపు, అనిల్‌కుమార్ ప్రధానపాత్రధారులు. ఆగస్ట్ 22న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. 'పరాక్రమం' సంఘర్షణతో కూడుకున్న కథ అని, నా జీవితంలో ఎదురైన అవమానాలు, అనుభవాల్లోంచి పుట్టుకొచ్చిన కథ ఇదని, అందరికీ నచ్చేలా సినిమా ఉంటుందని బండి సరోజ్‌కుమార్ అన్నారు. థియేటర్‌కి వెళ్లి సినిమా చూడాలనే క్యూరియాసిటీని కలిగించేలా టీజర్ ఉందని పలువు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ చిత్రానికి కెమెరా: వెంకట్ ఆర్.ప్రసాద్.